క్లుప్తంగా

ఉత్తమ సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు



బ్రాహ్మణగూడెంలో డాక్టర నిషిత, స్టాఫ్‌నర్స్ సుశీలను సన్మానిస్తున్న నాయకులు

చాగల్లు: సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు వస్తుందని గోదావరి జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి బాబూరావు అన్నారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా మండలంలోని బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.నిషిత, స్టాఫ్ నర్స్ వై.సుశీల ఉత్తమ ఉద్యోగులుగా పురస్కారాలు స్వీకరించడంతో మంగళవారం పీహెచ్‌సీ సిబ్బంది, నాయకులు ఇరువురిని ఘనంగా సన్మానించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ప్రత్తిపాటి నాగేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, గారపాటి శ్రీనివాస్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం ధనలక్ష్మికి సత్కారం

నల్లజర్ల: స్వాతంత్ర్య దినోత్స వేడుకలో కలెక్టరు ప్రశాంతి చేతులమీదుగా ఉత్తమ ఏఎన్‌ఎం ఆవార్డు అందుకున్న పోతవరం పీహెచ్‌సీ ఏఎన్‌యం ధనలక్ష్మిని మంగళవారం ఆసుపత్రి వైద్య, ఆరోగ్య సిబ్బందితో పాటు డాక్టరు సిరాజుద్దీన్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యం.జయప్రకాష్, మీరాబాయ్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు పంటపై జీఎస్టీ తగ్గించాలి

దేవరపల్లి: పొగాకు పంటపై జీఎస్టీని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల రైతు సంఘాల ప్రతినిధులు ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరిని కోరారు. రాజమహేంద్రవరంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం రైతు సంఘాల ప్రతినిధులు ఎంపీని కలిసి పలు సమస్యలను వివరించారు. పొగాకు పంటపై జీఎస్టీని పెంచితే దీని ప్రభావం రైతులపై పడుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న 28 శాతం జీఎస్టీని తగ్గించాలని కోరారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ ఎన్‌ఎల్ఎస్ పొగాకు పంట ఉత్పత్తిని తగ్గించుకుని ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. రైతుల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళతానని ఆమె తెలిపారు. దేవరపల్లి వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, కాట్రు వీరవెంకట సత్యనారాయణ, గోపాలపురం వేలం కేంద్రం అధ్యక్షుడు విల్లూరి రాంబాబు, కొయ్యలగూడెం వేలం కేంద్రం అధ్యక్షుడు కాకర్ల వివేకానంద, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

పెరవలి: జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో వరి పంటపై ఆశించే తెగుళ్లను అరికట్టటానికి డ్రోన్ సహాయంతో కషాయాలను పిచికారీ చేస్తున్నామని జిల్లా సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సాకా రామకృష్ణ తెలిపారు. పెరవలి మండలం కాపవరంలో వరిచేలు, బెండ, వంగ పంటలపై కషాయాలను డ్రోన్‌తో పిచికారీ కార్యక్రమం అధికారుల సమక్షంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 45 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టామని అందులో భాగంగా డ్రోన్ల సహాయంతో కషాయాలను పిచికారీ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇందుకోసం 30 డ్రోన్లను వినియోగిస్తామని తెలిపారు. జీవీఆర్ సూర్యనారాయణ, వెంకట కృష్ణ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తాళ్లపూడి(కొవ్వూరు): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లోని ప్రజల అవసరాలను, సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయం సర్వసభ్య సమావేశం ఎంపీపీ కాకర్ల నారాయుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీడీవో టీబీ వెంకటరమణ సమావేశం కొనసాగించారు. వివిధ శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాను ఆమోదించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, మండల ప్రత్యేక అధికారిని బి.సుభాషిని, తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండల అధికారులు పాల్గొన్నారు.

నిమ్మ సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

నల్లజర్ల: నిమ్మ, ఆయిల్‌పామ్‌లో తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానశాఖ సిబ్బంది రైతులకు సూచించారు. మంగళవారం గంటావారిగూడెంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రేఖ రైతులకు పలు సూచనలు అందించారు. నిమ్మలో నత్రజని ఎరువులు 25 శాతం పశువుల ఎరువు, 25 శాతం వేపపిండి, మిగిలిన 50 శాతం రసాయన ఎరువుల రూపంలో రెండు దఫాలుగా వేసుకోవాలన్నారు. పూత,పిందె రాలిపోకుండా 1ఎం.ఎల్ ప్లానోఫిక్స్, 4.5 ఎం.ఎల్ నీటిలో కలిపి పూత సమయంలో ఒకసారి, కాయగోలి గుండు సైజులో మరో సారి పిచికారీ చేయాలన్నారు.ఉద్యానశాఖాధి కారి యం.బబిత, వ్యవసాయాధికారి సోమశేఖరం, ఉద్యాన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కొవ్వూరులో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ, నాయకులు



నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, ఆహార పొట్లాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, నాయకులు



పెద్దేవంలో వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు, అభిమానులు



కోరుమామిడిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అభివృద్ధి ప్రదాత.. సంక్షేమ విధాత వైఎస్సార్

- జన హృదయ నేతకు ఊరూవాడా ఘన నివాళి
- అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ



బ్రాహ్మణగూడెంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

దేవరపల్లి: జనహృదయ నేత, అభివృద్ధి ప్రదాత.. సంక్షేమ విదాత వైఎస్సార్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో ఊరూవాడ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి, పేదలకు రాజన్న చేసిన సేవలను స్మరించుకున్నారు. మహానేత ఆశయాల సాధనకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కృషి చేస్తామని ఆ పార్టీ నాయకులు పునరుద్ఘాటించారు.

పేదల పెన్నిధి డాక్టర్ వైఎస్సార్ వర్ధంతిని వైఎస్సార్ సీపీ శ్రేణులు గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గ్రామ గ్రామాన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత పాల్గొని మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెం బస్టాండ్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి మాజీ మంత్రి వనిత, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, గన్నమని జనార్ధనరావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, కుసులూరి వెంకటసతీష్, మేడిబోయిన గంగరాజు, ఆచంట అనసూయ, కడలి హైమావతి, సర్పంచ్ బొంతా భరత్‌బాబు, నరహరిశెట్టి సుధాకర్, పలువురు పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పల్లంట్లలో పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, గన్నమని జనార్ధనరావు తదితరులు మహానేతకు నివాళులర్పించారు. దేవరపల్లి బస్టాండ్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ దుర్గారావు, నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రామలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, పార్టీ నేతలు పచ్చా రాంగోపాల్, కామిశెట్టి దుర్గారావు, కవల శ్రీనివాస్, దుగ్గిన ప్రసాద్ పాల్గొన్నారు.

పేదోళ్ల దేవుడు వైఎస్సార్

పెరవలి: వైఎస్సార్ పేదోళ్ల దేవుడని మండల ఎంపీపీ కార్పెర్ల ప్రసాద్ పేర్కొన్నారు. పెరవలి మండలంలో పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. పెరవలి, ఖండవల్లి, పిట్టల వేమవరం, కానూరు, ముక్కామల, అజ్జరం, అన్నవరప్పాడులో మంగళవారం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కొమ్మిశెట్టి రాము, వీరమల్లు సత్యనారాయణ, మండ తాతారెడ్డి, కొవ్వూరి సర్వోత్తమరెడ్డి, గండేపల్లి రామకృష్ణ, తోట సురేష్, నల్లిమిల్లి నాగిరెడ్డి, పంపన అంజి, ఎంపీటీసీ సభ్యులు బొకే వెంకటేశ్వర్లు, పల్లేటి రవి తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండలంలో..

ఉండ్రాజవరం(నిడదవోలు రూరల్): మండలంలోని వేలివెన్ను, పాలంగి, తాడిపర్రు, వెలగదుర్రు, సత్యవాడ, సూర్యరావుపాలెంలో దివంగత నేత వైఎస్ వర్ధంతి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు నిర్వహించి నివాళులర్పించారు. వేలివెన్నులో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, బూరుగుపల్లి కృష్ణ బ్రహ్మానందం, పాలంగిలో సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, నాయకులు వి.జానకీరామయ్య, పాలాటి శరత్‌బాబు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, బొక్కా శివ, సత్తిపండు, కొల్లి రాంబాబు, యార్లగడ్డ ఆశోక్, మేకం రవి పాల్గొన్నారు. నిడదవోలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ మేడవరపు బద్రం దొర, ఆ పార్టీ పట్టణ అధ్యక్షురాలు దారపురెడ్డి సుజాత పాల్గొన్నారు.

వైఎస్సార్ పాలన ఆదర్శనీయం

నిడదవోలు రూరల్: దివంగత సీఎం వైఎస్సార్ పాలన ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. వైఎస్సార్ వర్ధంతి ని పురస్కరించుకుని మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరం, కంసాలిపాలెం, అట్లపాడు, పెండ్యాల, జీడిగుంటలో పార్టీ శ్రేణులు ఆయన విగ్రహాలకు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోరుమామిడిలో పల్లారావు, కానుబోయిన శేషు, వింతా గంగాధర్‌రెడ్డి, రాపాక వెంకట్రావు, పెద్దిరాజు, తాడిమళ్లలో పెనుగొండ కృష్ణమోహన్, కొప్పుల రామదేవుడు, తిరుమళ్ల దుర్గారావు, కాటకోటేశ్వరంలో గుంటుపల్లి రామచంద్రరావు, కోసూరి అప్పారావు,పెనుగుర్తి రాము, పెండ్యాలలో ఉప్పులూరి రామకృష్ణాంజనేయులు, వడ్లమూడి సోమరాజు, కంసాలిపాలెంలో కొండపల్లి శ్రీనివాస్, మలిశెట్టి వీరప్రసాద్, బెజవాడ గంగాధర్, వివిధ గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



పంగిడిగూడెం అన్నదాన కార్యక్రమంలో ఆహారం వడ్డిస్తున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత

ప్రజల గుండెల్లో కొలువైన డాక్టర్ వైఎస్సార్

నల్లజర్ల: సంక్షేమ పాలనతో తెలుగు ప్రజల గుండెల్లో దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ కొలువయ్యారని మాజీ హోంమంత్రి తానేటి వనిత అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మంగళవారం నల్లజర్లలో వైఎస్సార్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, సర్పంచ్ పల్లి జ్యోతిసుబ్బారావు, నాయకులు బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, నక్కా పండు, మహిళా అధ్యక్షురాలు యజ్ఞవరపు లక్ష్మి, చిన్నీ నాగు యాదవ్, డాక్టరు శ్రీనివాస్, వలిరెడ్డి అర్జున్, ప్రత్తి మురళి, చిట్లా వెంకటేశ్వరావు, జాదుల దుర్గారావు, సన్యాసి నాయుడు, యలమర్తి శేషగిరి రావు, మేణ్ణి యువరాజు, కృష్ణ చౌదరి, చెల్లారి రామశ్రీనివాస్, నేతాజీ, జాలాది రవి, గాలింకి పండు, అచ్యుత శివదాజీ, వెంకటస్వామి పాల్గొన్నారు.దూబచర్ల సెంటర్లో పలువురు నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవి, పి. సత్యనారాయణ, బాలాజీ, సయ్యద్ మునాఫ్, దోవసాయి పాల్గొన్నారు. పోతవరం,అయ్యావరం,ఆవపాడులో వైఎస్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

రాజన్నా.. నిను మరువం

నిడదవోలు రూరల్: మహానేత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం నిడదవోలు నియోజకవర్గంలో ఊరూవాడ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నిడదవోలు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు శ్రీనివాస్‌నాయుడు భోజనం ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ కాలనీ, బసివిరెడ్డిపేటలో వైఎస్సార్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ, అయినీడి పల్లారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, నాయకులు గజ్జరపు శ్రీరమేష్, ఎస్‌కే చాన్‌భాషా, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడిలో నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా యాక్టివ్ కార్యదర్శి వంటోలు పోసిబాబు, కొసన శివ, రత్నాజీ పాల్గొన్నారు. పోచవరంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్ వర్ధంతిని నిర్వహించారు. పెద్దేవంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, నాయకులు బట్టు సుబ్బారావు పాల్గొన్నారు. అన్నదేవరపేటలో, జగనన్న కాలనీ వద్ద వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో నాయకులు పోశిన శ్రీకృష్ణదేవరాయులు, పిట్టా శ్రీనివాస్, నూతంగి సురేష్, ఎలిపే రాజు పాల్గొన్నారు. మలకపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ కుంటముక్కల కేశవనారాయణ, వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, గజ్జరంలో సర్పంచ్ గండి రాంబాబు, నాయకులు గన్నిన రత్నాజీ, ప్రక్కిలంకలో యాళ్ల బాబూరావు, తిరుగుడుమెట్టలో మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, వల్లభశెట్టి చిన్ని, తాడిపూడిలో గోతం మల్లికార్జునరావు, టి.వెంకటలక్ష్మి, కనకదుర్గ పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరం మండలం పాలంగిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

ప్రజా సంక్షేమానికి విశేష కృషి

చాగల్లు: డాక్టర్ వైఎస్సార్ రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి విశేష కృషి చేశారని డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య అన్నారు. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, మార్కొండపాడులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, నాయకులు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఉండవల్లి శ్రీనివాస్, పొన్నాడ సింహాద్రి, వీరవల్లి కిషోర్, శివ తదితరులు పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళి

తాళ్లపూడి(కొవ్వూరు): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొవ్వూరులోని మెయిన్‌రోడ్డు, మెరకవీధిలలోని వైఎస్సార్ విగ్రహాలకు, తలారి వెంకట్రావు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తలారి ఆధ్వర్యంలో సుమారు 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్, ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి బండి అబ్బులు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పరిమి సోమరాజు, పట్టణ అధ్యక్షుడు చిట్లూరి అన్నవరం, మండల కన్వీనర్ వెంపాటి సురేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, ఎంపీపీ మట్టా వీరాస్వామి, నాయకులు తోట రామకృష్ణ, మారిన రామకృష్ణ, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, పామేర్ల నగేష్, ఇంటి వీర్రాజు, గండి రాంబాబు, కవల నాగేశ్వరావు, శైలేంద్ర, కొయ్యే దుర్గారావు, మదిపట్ల గీత, అంకోలు లిల్లి పద్మ, చీర అరుణ పాల్గొన్నారు. పెనకనమెట్ట సావరంలో ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి బండి పట్టాభి రామారావు (అబ్బులు), నాయకులు మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపవరంలో మాజీ మండల కన్వీనర్ సుంకర సత్యనారాయణ, పశివేదలలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పరిమి సోమరాజు, వేములపల్లి రామారావు, కొడమంచిలి మంగా సత్య, ఎన్ ఉదయకిరణ్ తదితరులు వైఎస్సార్‌కు నివాళులర్పించారు. దొమ్మేరు. ధర్మవరం, కుమారదేవం, అరికి రేవుల, చిడిపి, పంగిడి, నందమూరు, మద్దూరు తదితర గ్రామాల్లో వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

55 కిలోల లడ్డూ.. రూ.96 వేలు

- రూ. 81 వేలు పలికిన విగ్రహం



దేవరపల్లి నిమ్మలపాటి వీధిలోని గణేశ్ విగ్రహం



దేవరపల్లి మెరకవీధి వినాయకుడి ఆలయం వద్ద రూ. 96 వేలు పలికిన లడ్డూ ప్రసాదం

దేవరపల్లి: వినాయక చవితి పూజల అనంతరం విగ్రహాలు, లడ్డూ ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు వేలం నిర్వహిస్తున్నారు. వేలం పాటలో విగ్రహం, లడ్డూ ప్రసాదాలను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. దేవరపల్లి మెరకవీధి వినాయకుడి గుడిలో స్వామి వారికి 55 కిలోల లడ్డూను భక్తుడు నల్లా స్వామి ప్రసాదంగా నివేదించాడు. లడ్డూ ప్రసాదాన్ని సోమవారం రాత్రి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. గంటా వెంకటేశ్వరరావు రూ.96 వేలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

రూ. 81 వేలు పలికిన విగ్రహం : స్థానిక నిమ్మలపాటి వీధిలోని వరసిద్ధి వినాయకుడి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వేలం నిర్వహించారు. ఈ నెల 4న స్వామి వారి విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ప్రత్యేక వాహనం ఊరేగించి నిమజ్జనం చేయడానికి వేలం పాట నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని పోటీపడగా చివరకు కవల సోమరాజు రూ.81 వేలకు స్వామివారి విగ్రహాన్ని దక్కించుకున్నారు.

విద్యార్థులకు సన్మానం

చాగల్లు: మండల కేంద్రమైన చాగల్లులో తెలగా సంఘం ఆధ్వర్యంలో శ్రీగణపతి నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ కళలను, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని సినీ నటుడు పృథ్వీరాజ్ అన్నారు. సోమవారం రాత్రి గంద్రోతు కృష్ణారావు ఆడిటోరియంలో పృథ్వీరాజ్ దంపతులను, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీ కృష్ణను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఉత్సవాలు నిర్వహణకు కృషిచేస్తున్న కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం: పదో తరగతి ఫలితాల్లో చాగల్లు హైస్కూల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన టి.సాయి సతీష్ వర్మకు దాత జుట్టా సీతారామయ్య జ్ఞాపకార్థం వారి అల్లుడు వి.భీమేశ్వరరావు, కుమారులు (పూళ్ల) సహకారంతో బంగారు పతకాన్ని ముఖ్యఅతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఇంటర్ పరీక్షల్లో 931 మార్కులు సాధించిన వి.పుష్ప లక్ష్మీకుమారికి జగతా వీరభద్రరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాసరావు బంగారు పతకాన్ని అందజేశారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఏపీ నాటక పరిషత్ చైర్మన్ బుద్దాల వెంకట రామారావు, కమిటీ అధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

తాళ్లపూడి(కొవ్వూరు): కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరు మండలం కుమారదేవంలో మంగళవారం బాబు ష్యూరిటీ మోసం, గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మండల నాయకులు కలసి గ్రామంలో ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు, అమలు చేయని విధానాన్ని »బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ« కార్యక్రమంలో భాగంగా రచ్చబండ నిర్వహించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ఏడాదిపాటు అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ప్రస్తుతం రైతులకు యూరియా, ఎరువులు లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందడం లేదన్నారు. ధాన్యం సొమ్ము బకాయిలు చాలామంది రైతులకు ప్రభుత్వం చెల్లించలేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంతమణి రమేష్‌బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్‌కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, మండల కన్వీనర్ వెంపాటి సురేష్, పట్టణ కన్వీనర్ చిట్టూరి అన్నవరం, నాయకులు తోట రామకృష్ణ, ఉప్పులూరి సూరిబాబు, పరిమి సోమరాజు, సుంకర సత్యనారాయణ, కారింకి సూరిబాబు, గోలి శ్రీను, పామేర్ల నగేష్, గద్దే రామకృష్ణ, జి పేరయ్య, ఎం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కుమారదేవంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

సందడిగా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం



వేగేశ్వరపురంలో ట్రాక్టర్‌పై వినాయక విగ్రహం ఊరేగింపు



వడ్లూరులో గణేశ్ మండపంలో శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా నిమజ్జనం కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో సందడిగా నిర్వహిస్తున్నారు. మంగళవారం నిడదవోలు మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూజలు చేసి ఊరేగింపు నిర్వహించారు. గణనాథుల విగ్రహాలను కాటకోటేశ్వరం, శెట్టిపేటలో వైభవంగా ఊరేగించి కాలువల్లో నిమజ్జనం చేశారు. ఉండ్రాజవరం మండలంలోని వడ్లూరు సంతమార్కెట్‌లో ఏర్పాటు చేసిన బాలగణపతిస్వామిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు దర్శించుకుని, పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కె.సిద్ధార్థ, స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లంబోదరా.. వెళ్లిరావయ్యా

తాళ్లపూడి: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం వినాయక నిమజ్జనాలు కమిటీ సభ్యులు, యూత్ నృత్యాలను చేస్తూ సందడిగా విగ్రహాలను నిమజ్జనం చేసారు. వేగేశ్వరపురంలోని వీరన్నబాబు గద్దె వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని వీరగణపతి యూత్ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగించారు. బాణసంచా కాల్పులు, బుట్ట బొమ్మలు, శక్తి వేషాలు, కొయ్య బొమ్మలు, ఫుల్ బ్యాండ్ పార్టీ, తీన్‌మార్ నృత్యాలతో సందడిగా ఊరేగించారు.

వైభవంగా పూజాగణపయ్య నవరాత్ర ఉత్సవాలు

నిడదవోలు : పట్టణంలోని గణేశ్ చౌక్ సెంటర్లో వేంచేసియున్న పూజా గణపతి, కుమారస్వామి ఆలయం వద్ద మంగళవారం గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. హైదరాబాదు నుంచి తీసుకువచ్చిన సుమారు 18 అడుగుల వినాయక విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో 103వ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ జనసేన అధ్యక్షుడు రంగా రమేష్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు మోర్త ప్రమోద్ కుమార్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.